విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV THE VOICE OF TELANGANA

ఎడిటర్ జేరిపోతుల సంపత్

9912758107

సంపుటి: 16 | సంచిక : 150 | ఆదివారం 4.10. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




## విద్యుత్ కోతలు ఉండవ్

### మంత్రి కోమటిరెడ్డి హామీ

**ఇతర రాష్ట్రాల నుంచి 19 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు**

**యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు**

**నల్గొండకు 5 వేల ఇందిరమ్మ ఇళ్ళు**

హైదరాబాద్ తెలంగాణ వాణి) తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మిగతా 2లో..



## ముంబైలో ఉద్రిక్తత

### అటు సీజేపీ ఇటు జెన్ నెక్ట్స్

**పోటాపోటీ ప్రదర్శనలు భారీగా పోలీస్ బలగాలు**

హైదరాబాద్ తెలంగాణ వాణి) ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త మిగతా 2లో..




# పిల్లలకు పొంచివున్న ముప్పు..

## తల్లిదండ్రులకు సీఎం రేవంత్ వార్నింగ్

- హైదరాబాద్ వేదికగా నిర్వహించిన 'నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ దక్షిణ మండల ప్రాంతీయ సదస్సు
- ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లల సైబర్ భద్రత అత్యంత కీలకమైన అంశం
- తెలంగాణలో వారి రక్షణ కోసం త్వరలోనే ఒక సమగ్ర 'చైల్డ్ ఆన్లైన్ సేఫ్టీ ఫ్రేమ్ వర్క్'
- గాంధీజీ న్యాయాన్ని కేవలం వృత్తిగానే కాకుండా పేదలు, బలహీనుల కోసం ఒక ఆయుధంగా ఉపయోగించారు
- అదే స్ఫూర్తితో న్యాయ సేవా సంస్థలు పనిచేస్తూ రూపాయి లేని పేదవాడికి కూడా ఉచితంగా న్యాయం అందించాలి
- పిల్లలు ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నప్పటికీ, అక్కడ పొంచి ఉన్న ప్రమాదాలను గుర్తించేంత అవగాహన
- విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో భరోసా సైబర్ ల్యాబ్‌లు, యాప్ ద్వారా విద్యార్థులను 'సైబర్ అంబాసిడర్లు'గా' తీర్చిదిద్దుతున్నాం
- పిల్లలతో ప్రతిరోజూ స్నేహపూర్వకంగా, ఆసక్తిగా మాట్లాడాలని, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో గమనిస్తూ సరైన మార్గదర్శకత్వం




## రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలిచి తీరాలి

- ఖైరతాబాద్ ఉప ఎన్నిక కీలకం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భాజపా శ్రేణులకు స్పష్టం
- బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతలందరూ ప్రజాక్షేత్రంలోనే పని చేయాలి
- హైదరాబాద్ బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన
- యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్'
- కేంద్ర మంత్రి అమిత్ షా ఈ నెల 4న బేగంపేట ఎయిర్‌పోర్టుకు రానున్నారు
- కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలకాలని కోరారు.



రానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక పార్టీకి అత్యంత కీలకమని.. గెలిచి తీరాల్సిందేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భాజపా శ్రేణులకు స్పష్టం చేశారు. దీనికి గాను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతలందరూ ప్రజాక్షేత్రంలోనే పని చేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని కోరారు. కేంద్ర మంత్రి అమిత్ షా ఈ నెల 4న బేగంపేట ఎయిర్‌పోర్టుకు రానున్నారని, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలకాలని కోరారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు మాట్లాడారు.

## ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే: ఖర్గే



హైదరాబాద్ తెలంగాణ వాణి)
ప్రస్తుత లోక్‌సభ వివిధ రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఆయా ఎన్నికలన్నీ చట్టవిరుద్ధంగా జరిగాయని, వాటిని రద్దు చేసి.. బ్యాలెట్ పేపర్ విధానంలో మరోసారి పోలింగ్ నిర్వహించాలని అన్నారు. కర్ణాటకలోని కలబురిగిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈవీఎంలను దుర్వినియోగం చేస్తున్నట్లు అధికార పార్టీకి చెందిన నేతలే చెబుతున్నారని చెప్పారు. చట్టవిరుద్ధంగా ఎన్నికైన వాళ్లే ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నారని ఆక్షేపించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని ఖర్గే విమర్శించారు. 'సర్' పేరుతో కేంద్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. 'సర్'కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతాయని చెప్పారు. ఒక్కో బూత్ నుంచి దాదాపు 500 ఓట్లను తొలగిస్తున్నారని, అలా జరిగితే..అది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నిక ఎలా అవుతుందని ఖర్గే ప్రశ్నించారు. భాజపా, ఆరెస్సెస్‌కు చెందిన కార్యకర్తలు ప్రతి గ్రామానికి వెళ్లి వ్యతిరేక వర్గానికి చెందిన ఓట్లను దగ్గరుండి తొలగిస్తున్నారని ఆరోపించారు.

### ధర్మమే దేశానికి

## ఊపిరి

**ధర్మం..దేశం వేర్వేరు కాదు**

**సవాళ్లకు ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం**

**ఆర్ఎస్ఎస్ సంఘచాలక్ మోహన్ భగవత్ వెల్లడి**



ఢిల్లీ (తెలంగాణ వాణి) భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, "మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి మిగతా 2లో..

## ఆస్తుల విచారణ సవాళ్లు

### రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

**ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి**

**నా ఆస్తిపైనా విచారణకు ఎప్పుడైనా సిద్ధమే**

**ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్ తెలంగాణ వాణి)
తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మిగతా 2లో..

## మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన తెలంగాణ మంత్రులు



శనివారం డే పాస్‌తో ఇతర మంత్రులతో కలిసి భట్టి విక్రమార్క ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రోస్టేషన్‌కు వచ్చారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు మెట్రో రైలులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రులందరికీ కాంబో పాస్‌ను ఆయన కొనుగోలు చేశారు.

## ఈనెల 18న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ

హైదరాబాద్ తెలంగాణ వాణి)
తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. అక్టోబర్ 10 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'సద్దుల బతుకమ్మ'ను ఈనెల 18వ తేదీన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పై వేలాది మంది మహిళలతో కలిసి అట్టహాసంగా నిర్వహించనున్నారు. అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు భారీ బతుకమ్మ ర్యాలీ నిర్వహించనున్నారు. అదేవిధంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి లో 10 రోజుల పాటు ప్రత్యేక






బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. అలాగే తెలంగాణలోని అన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## తెలంగాణ ఉద్యమానికి మరసం ఉద్దీపన

**మంజీరా అక్షరాలే తెలంగాణకు ఆయుధం**

**మరసం భావితరానికి దిక్సూచి**

**ప్రజా సాహిత్యానికి మరసం ప్రాణం**

**మరసం 40 ఏళ్ల సభలో మాజీ మంత్రి తన్నీరు**



హైదరాబాద్:(తెలంగాణ వాణి) కవులు అంటే కవిత్వాన్ని వెలువరించే వారు మాత్రమే కాదని మాటకు, పాటకు , ఆటకు ప్రాణం పోసే వారని క్రియాశీలకంగా నిరూపిస్తున్న మంజీరా రచయితల సంఘం భావితరానికి దిక్సూచి అని మాజీమంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో, గోపాల్ రెడ్డి వేదికపై శుక్రవారం జరిగిన మంజీరా రచయితల సంఘం 40 ఏళ్ల వార్షికోత్సవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం అంటే వేడుక కాదని ప్రజాపక్షంలో నిలబడడమని మరసం నిరూపించడం చారిత్రాత్మకమని మిగతా 2లో..

తెలంగాణ వాణి
TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలుగు దినపత్రిక



# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే

మహారాష్ట్ర రాజధాని ముంబయిలో శుక్రవారం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న సీజేపీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలోనే అభిజిత్ దీప్కే నేతృత్వంలోని సీజేపీ పిలుపు మేరకు ముంబయి శివాజీ పార్క్‌లో నిరసనకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సమాజ ప్రతినిధులు తరలివచ్చారు. ఈ ఆందోళనలో గాంధీ కుటుంబానికి చెందిన తుషార్ గాంధీ, ప్రముఖ బాలీవుడ్ నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, సంగీత దర్శకుడు విశాల్ దద్లానీ కూడా పాల్గొని మద్దతు తెలిపారు. రాజకీయ పార్టీలు శివసేన, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీలు కూడా నిరసనకు తమ మద్దతు ప్రకటించాయి. నిరసనకారుల్ని ఉద్దేశించి ప్రసంగించిన సీజేపీ నాయకుడు అభిజిత్ దీప్కే, నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అసమర్థంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు జరిగిన 2 నెలల వ్యవధిలోనే మరోసారి తాము నిరసన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. మరోవైపు సీఈసీ తప్పక రాజీనామా చేయాల్సిందేనని, నేర విచారణ ఎదుర్కోవాల్సిందేనని దాదర్‌లో జరిగిన నిరసనలో సీజేపీ నాయకుడు అజింక్యా శిందే డిమాండ్ చేశారు. ఇంకా దిల్లీ పోలీసులు మళ్లీ క్రూరంగా ప్రవర్తించారని, మారండి లేకపోతే తామే మారుస్తామని సీజేపీ నాయకుడు సౌరవ్ దాస్ హెచ్చరించారు. అంతకుముందు అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో మధ్యాహ్నం 4 గంటలకు నిరసన చేపడతామని సీజేపీ ముందుగానే హెచ్చరించింది. పోలీసుల నుంచి అనుమతి లభించకపోయినప్పటికీ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చింది. నిరసన నేపథ్యంలో శివాజీ పార్క్



పరిసరాల్లో భారీగా పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. సమీపంలోని దాదర్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పెద్ద సంఖ్యలోనే యువత శివాజీ పార్క్ వద్ద నిరసన ప్రాంతానికి చేరుకుంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ త్రివర్ణ పతాకాలతో పాటు వివిధ ప్లకార్డులను ప్రదర్శించారు.

### సర్‌పై సీజేపీ ఆరోపణలు

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. 2025 ఓటర్ల జాబితాను మార్చకుండా నిలిపివేయాలని కోరుతోంది. ఇటీవల ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి- సర్ ప్రక్రియు సంబంధించి కొన్ని నిర్ణయాలు, ఉత్తర్వులపై 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు జాతీయ మీడియా కథనం పేర్కొంది. ఈ నివేదికల ఆధారంగానే పలు ప్రతిపక్ష పార్టీలతో పాటుగా సీజేపీ కూడా సీఈసీ రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తోంది. అయితే మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండించింది. సర్ ప్రక్రియ సహా ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలన్నీ ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ ఏకగ్రీవంగానే తీసుకున్నవని స్పష్టం చేసింది.

సీజేపీ చేపట్టిన నిరసనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఎన్నికల సంఘం కమిషనర్లు ఇప్పటికే అన్ని అనుమానాలకు వివరణ ఇచ్చారని, ప్రతిపక్షాలు నకిలీ కథనాలు వ్యాప్తి చేస్తున్నాయని, దీనిని ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. మరోవైపు మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత ఆశిష్ షెలార్ కూడా సీజేపీ నిరసనలపై తీవ్ర స్థాయిలో విరు చుకుపడ్డారు. ఈ ఆందోళనలను రాజ్యాంగ విరుద్ధ చర్యగా అభివర్ణించారు. సర్ ప్రక్రియపై ఏమైనా అభ్యంత రాలు ఉన్న ట్లయితే న్యాయపరంగా, రాజ్యాంగ బద్ధంగా ఎదుర్కోవాలని, వీధుల్లోకి వచ్చి అరాచకం సృష్టించడం సరికాదన్నారు.

### జెన్ నెక్ట్స్ ముంబయి కౌంటర్ ప్రొటెస్ట్

మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలకు వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబయి' పేరిట ఓ వర్గం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టింది. సీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని దిగజార్చేలా మాట్లాడుతున్నారని, రాజ్యాంగ పరిరక్షణ కోసమే తాము ఇక్కడ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నట్లు సదరు బృందం ప్రతినిధులు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే పోలీసులు పరిస్థితుల్ని నిశితంగా పరిశీలిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు

వర్షాకాలంలో కూడా సమ్మర్‌లా ఎండలు మండుతుండగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది! నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఉత్తర భారతంలో కొనసాగుతున్నా, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపింది. కేరళ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వరకు పలు ప్రాంతాల్లో అక్టోబర్ 7 వరకు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా కేరళ, మాహే ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అక్టోబర్ 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది.

### తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్ర, రాయలసీమలో అక్టోబర్ 2 నుంచి వర్షాలతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఆ పరిస్థితి అక్టోబర్ 5 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణలోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై ఏర్పడుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాల విషయంలో మార్పులు కనిపించొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

### తమిళనాడులో గాలుల వేగం

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో కూడా వర్షాలు



కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న కేరళ, లక్షద్వీప్, తమిళనాడు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తమిళనాడుతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలోనూ వాతావరణం మారే అవకాశం ఉంది. వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ పరిస్థితులను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

### కర్ణాటకలోనూ వానలు

కోస్తా కర్ణాటకలో అక్టోబర్ 2న విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో అక్టోబర్ 5న అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో బెంగళూరు సహా దక్షిణ కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణం మారొచ్చు. మహారాష్ట్రలోని కోంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ అక్టోబర్ 7 వరకు అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది.

### ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాలు

దక్షిణాదితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాల పరిస్థితి కొనసాగనుంది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని ఐఎండీ తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్ని చోట్ల భారీ వర్షం పడే అవకాశం ఉంది. ఒడిశా, బంగాల్, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవుల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడొచ్చు. బిహార్, జార్ఖండ్‌లో అక్టోబర్ 5 నుంచి 7 మధ్య అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడే అవకాశం ఉంది.

### ఉత్తరాదిలో రుతుపవనాల వెనక్కి ప్రయాణం

అదే సమయంలో ఉత్తర భారతంలో నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతోంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్?ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు త్వరలో వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ రుతుపవనాల ప్రభావం తగ్గుతోంది. అలా ఉత్తర భారతంలో వానలు తగ్గి వాతావరణం పొడిగా మారుతున్నా, దక్షిణ భారతంలో మాత్రం అక్టోబర్ మొదటి వారం వరకు వర్షాల ప్రభావం కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులను గమనించాల్సి ఉంటుంది.

# జాతిపితకు ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరిగాయి. దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు గాంధీ, శాస్త్రికి నివాళులర్పించారు. ఉదయం రాజ్‌ఘాట్‌కు చేరుకున్న వారు గాంధీజీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం విజయ్‌ఘాట్‌ను సందర్శించి లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. రాజ్‌ఘాట్‌లో నిర్వహించిన సర్వధర్మ ప్రార్థనలోనూ ప్రముఖులు పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు మహాత్మా గాంధీకి పుష్పాంజలి ఘటించారు. దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

### శాంతి, అహింస మరింత అవసరం

గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్' వేదికగా సందేశాన్ని పంచుకున్నారు. మహాత్మా గాంధీ జీవితం, ఆదర్శాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో యుద్ధాలు, సంఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో గాంధీ శాంతి, అహింస సందేశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడిందని పేర్కొన్నారు. దేశ ప్రజల తరఫున గాంధీకి గౌరవపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. సహానుభూతి, సమ్మిళిత విధానాలకు ప్రాధాన్యతనిస్తూ 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా దేశం ముందుకు సాగుతోందన్నారు. ఈ లక్ష్యం అందరి సంక్షేమాన్ని కోరుకునే గాంధీ 'సర్వోదయ' స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని చెప్పారు. నైతిక ప్రవర్తన, క్రియాశీల భాగస్వామ్యంతో శక్తివంతమైన, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి నిబద్ధతను పునరుద్ఘాటించాలని పిలుపునిచ్చారు.

### బాపూజీ జీవితం మార్గదర్శకం

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కూడా గాంధీకి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ జీవితం, సందేశం శాంతి, కరుణ, నిస్వార్థం, సేవాభావాలకు శాశ్వత దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. గాంధీ ఆశించిన విలువలకు కట్టుబడి, న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన, సమ్మిళిత సమాజ నిర్మాణానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ గాంధీకి నివాళులర్పిస్తూ 'ఎక్స్'లో సందేశం పంచుకున్నారు. బాపూజీ జీవితం మొత్తం సత్యం, అహింస, కరుణ, సేవలకు మార్గదర్శిగా నిలిచిందన్నారు. ఆయన సందేశాలు ప్రతి యుగంలో మానవాళికి మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. గాంధీ కాలాతీత సందేశం మనల్ని ఉత్తమ సమాజం, సమైక్య భారత్ వైపు నడిపిస్తూనే ఉండాలని అన్నారు. గాంధీ ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రేరేపించాయని ప్రధాని పేర్కొన్నారు. మానవాళితో పాటు గాంధీ ఆలోచనల ప్రవాహం కొనసాగుతున్నంత కాలం అవి ఎప్పటికీ ప్రాసంగికంగానే ఉంటాయని అన్నారు. గాంధీజీ స్వదేశీ, ఖాదీకి ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తుచేస్తూ అక్టోబర్ 2న కనీసం ఒక ఖాదీ ఉత్పత్తిని కొనుగోలు చేసి 'ఇది స్వదేశీ' అని గర్వంగా చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

### శాస్త్రి సేవలను గుర్తుచేసుకున్న ప్రధాని

లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు నివాళులర్పించారు. శాస్త్రి నిరాడంబరత, దేశం పట్ల అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మరో వీడియో సందేశంలో శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదాన్ని గుర్తుచేశారు. దేశ సైనికులు, రైతులకు ఆయన అందించిన స్ఫూర్తిని ప్రస్తావించారు. వినయపూర్వకమైన వ్యక్తిత్వం కలిగినప్పటికీ శాస్త్రి దృఢమైన నాయకుడని ప్రధాని పేర్కొన్నారు. దేశం పట్ల ఆయనకున్న నిస్వార్థ భక్తి, ప్రధాన మంత్రిగా తన స్వల్ప పదవీకాలంలో దేశానికి సేవలందిం చేందుకు దోహదపడిందన్నారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ విజయ్‌ఘాట్‌కు వెళ్లి శాస్త్రికి నివాళులర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా గాంధీజీకి నివాళులర్పించారు. సత్యం, అహింస, సామరస్యం, న్యాయం అనే గాంధీజీ సూత్రాలపై నిలబడటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

### దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు

గాంధీ జయంతిని పురస్కరించుకుని దిల్లీలోని కర్తవ్య భవన్-1 సమీపంలో నిర్వహించిన శ్రమదాన్ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పాల్గొన్నారు. పరిసరాలను స్వయంగా పరిశుభ్రం చేశారు. గురుగ్రామ్‌లో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ 'స్వచ్ఛ భారత్ అభియాన్'లో పాల్గొని నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలో 'స్వచ్ఛతా హి సేవా'లో భాగంగా 'స్వచ్ఛథాన్ 2026' నిర్వహించారు. ఒడిశాలోని పూరీలో పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ శాండ్ ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇసుక యానిమేషన్ రూపొందించారు. ఈ కళాకృతిని సిద్ధం చేయడానికి సుమారు 30 నిమిషాలు పట్టిందని విద్యార్థులు తెలిపారు. జైపూర్‌లో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ గాంధీజీ, శాస్త్రికి నివాళులర్పించారు. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించారు. ఆయన జయంతిని భారత్‌లో గాంధీ జయంతిగా జరుపుకొంటారు. ఐక్యరాజ్యసమితి ఈ రోజును 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా గుర్తించింది. లాల్‌బహదూర్ శాస్త్రి 1904 అక్టోబర్ 2న ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొఘల్‌సరాయ్‌లో జన్మించారు. 1964 నుంచి 1966 వరకు భారత ప్రధానమంత్రిగా సేవలందించారు.

## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

ఎస్ఐఆర్‌పై వివాదం వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితా సవరణ పూర్తైన ప్రాంతాలలో తొలగించిన, విస్మరించిన అర్హులైన కొత్త ఓటర్లను తక్షణమే ఓటరు జాబితాలో చేర్చేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. దీంతో తాజాగా సర్ ప్రక్రియలో తొలగించిన ఓట్లు మళ్లీ ఓటర్ల జాబితాలో చేరనున్నాయి. అలాగే కొత్తగా 18 ఏళ్లు నిండినవారు తొలిసారి ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం లభించనుంది. ఎస్ఐఆర్ ప్రక్రియపై దేశవ్యాప్త ఆందోళనలు, నిరసనల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దిగొచ్చింది. చట్ట విరుద్ధంగా ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదులో అవకతవకలు జరిగాయంటూ సర్ ప్రక్రియను యువత, ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించడంతో ఈసీ గతంలో తీసుకున్న నిర్ణయాలను ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకుంటోంది. ఇటీవల ఫారం-6 రూల్స్‌లో మార్పులు చేసింది.

## సీఈసీని తొలగించాలంటూ జంతర్ మంతర్ నిరసనలు



కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆప్, యూత్ కాంగ్రెస్, పలు స్టూడెంట్ యూనియన్‌లు శుక్రవారం జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టాయి. 'సేవ్ డెమొక్రసీ' పేరుతో చేపట్టిన ఈ ఆందోళనలకు దిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ, యూత్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వెనక్కు తగ్గలేదు. దీనితో జంతర్ మంతర్ వద్దకు చేరుకున్న ఆప్ నేతలు ఆతిశీని, సౌరభ్ భరద్వాజ్‌ను, సుమారు 150 మంది ఆప్?, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనితో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా అక్రమంగా ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించారంటూ సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన సీఈసీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జంతర్ మంతర్ వద్ద యూత్ కాంగ్రెస్, ఆప్ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. దీనితో అనుమతి లేకుండా నిరసనలు చేస్తున్నారంటూ దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే సంజీవ్ ఝాలను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు జంతర్ మంతర్ వద్దకు వెళ్లకుండా ఆప్ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌ను నార్త్ అవెన్యూ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ, తనను, ఝాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆప్ నేత భరద్వాజ్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. తమను అరెస్టు చేసినప్పటికీ, ఆందోళనలు కొనసాగించేందుకు, జంతర్ మంతర్ వద్దకు చేరుకోవాలని ఆప్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఆయన కోరారు. తమ నిరసనలకు అనుమతి లేదని పోలీసులు చెప్పారని, అయితే ప్రజాస్వామ్యంలో తన నిరసనలు చేయడానికి అనుమతి అవసరమా అని ఆయన ప్రశ్నించారు. "సుమారు వారం రోజుల క్రితమే తాము జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతి కోరుతూ పోలీసులకు లేఖ ఇచ్చాం. అయినప్పటికీ వారు అనుమతి ఇవ్వలేదు. అందుకే మా ఆందోళనలను వ్యక్తం చేయడానికి, మా ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటున్నాం" అని సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. జంతర్ మంతర్ సమీపంలోని పలు మెట్రో స్టేషన్లను మూసివేశారని, అందువల్ల ప్రజలు సమీపంలో తెరచి ఉన్న మెట్రో స్టేషన్లలో ప్రయాణించాలని, వీలైతే నిరసన ప్రదేశానికి నడిచి వెళ్లాలని ఆయన కోరారు.

### ఇంటర్నెట్ సేవలు బంద్

ఆప్, విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ముందే ప్రకటించిన నేపథ్యంలో, శుక్రవారం పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా భద్రతను కట్టుదిట్టం చేశారు. దిల్లీలోని రాజీవ్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, జంతర్ మంతర్ సహా 12 స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను మూసివేశారు. అంతేకాదు జంతర్ మంతర్ పరిసరాల్లో ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు. జనపథ్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, బారాఖంబా, సేవ్ తీర్థ్, మండి హౌస్, లోక్ కల్యాణ్ మార్గ్, ఐఎన్ఏ, చావ్రి బజార్, రామకృష్ణ ఆశ్రమ్ మార్గ్, దిల్లీ స్టేషన్లను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మూసివేస్తున్నట్లు డీఎంఆర్‌సీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. అయితే రాజీవ్‌చౌక్, మండి హౌస్, దిల్లీ, సెంట్రల్ సెక్రటేరియట్ స్టేషన్లలో ఇంటర్‌ఛేంజ్ సౌకర్యం ఉందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఆప్, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టాయి. అయితే ఈ నిరసనలకు ముందుగా పోలీసులు అనుమతి నిరాకరించారు. సున్నితమైన ప్రదేశాల్లో కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. రాకపోకలను నియంత్రించడానికి, అనధికారిక సమావేశాలను నిరోధించడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

## ప్రపంచానికి భారత ఆధ్యాత్మిక జ్ఞానం పరిష్కారం చూపుతుంది: మోహన్ భగవత్



భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, "మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి" అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది" అని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. "ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు" అని ఆయన వ్యాఖ్యానించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. "మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారు" అని భగవత్ ఉద్ఘాటించారు.

## మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ టౌన్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
సోమవారం జిల్లాలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారుల పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పర్యటన ఏర్పాట్లపై శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో సిద్ధంగా ఉండాలని, పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. బాధ్యతలను అధికారులకు అప్పగిస్తూ, పోలీసు బందోబస్తు, ప్రోటోకాల్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏఎస్పీ సాయికిరణ్ వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకూడదు

### రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి




**నిర్మల్ టౌన్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలని, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లకు కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని కస్బా, న్యూ పోచంపాడ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎస్ఐఆర్ ప్రక్రియను సమీక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, భైంసా, ఉట్నూర్ సబ్ కలెక్టర్లు అజ్మీరా సంకేత్ కుమార్, ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

## సబ్దల్‌పూర్‌లో ప్రజలకు అవగాహన సదస్సు



**ఎల్లారెడ్డి, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సబ్దల్‌పూర్ గ్రామంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల వినియోగం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాలపై ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

## స్కావెంజర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి

### టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం

**ఎల్లారెడ్డి, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**




కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో స్కావెంజర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారికి నెలల తరబడి జీతాలు అందక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి, ఇకపై ప్రతి నెలా సకాలంలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపారు.

## ఇండియా కూటమి ఆధ్వర్యంలో అక్టోబర్ 7న నిరసన ర్యాలీ



**నిజామాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అక్టోబర్ 7న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కాట్‌పల్లి నగేష్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్‌లో అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని, దీనిపై మండల కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కాగా, భారత ఎన్నికల సంఘం ప్రస్తుతం ఎస్ఐఆర్-2026కు సంబంధించిన ఓటరు సేవలను నిర్వహిస్తోంది. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్‌గౌడ్, సీపీఐ (ఎంఎల్) వనమాల కృష్ణ, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్‌రాములు, రమేష్‌బాబు, సీపీఐ(ఎంఎల్) నగర కార్యదర్శి సుధాకర్, సయ్యద్ ఫెరోజ్ అలీ, రఘురామ్, పిట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక స్థైర్యం, స్త్రీ సాధికారతే 'బియాండ్ ది హొరైజన్' లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే 'బియాండ్ ది హొరైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్' జాతీయ ప్రచార యాత్ర లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని ధైర్యంగా అధిగమించాలని సూచించారు. మానసికంగా కుంగిపోయిన వారు సమస్యలను ఒంటరిగా ఎదుర్కోకుండా కుటుంబ సభ్యులు, మిత్రులు లేదా వైద్య నిపుణుల సహాయం తీసుకోవాలని కోరారు. బాలురు, బాలికల మధ్య వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రచార యాత్రలో భాగంగా ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని



కలెక్టర్ తెలిపారు. అనంతరం మానసిక ఆరోగ్య అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించడమే యాత్ర ఉద్దేశమని సెహర్ హష్మీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రచార యాత్ర రైడర్లు పరాస్, అమిత్ త్యాగి, రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

## భూ దరఖాస్తులు మంత్రుల పర్యటపై కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్షా

**నిర్మల్ టౌన్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో భూ దరఖాస్తుల పరిష్కారం, రీ-సర్వేపై సమీక్ష నిర్వహించారు. భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. భూముల రీ-సర్వేను వేగవంతం చేసి సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం సోమవారం జిల్లాలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అధికారులు సంబంధిత నివేదికలతో సిద్ధంగా ఉండాలని, పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు,



పోలీసు బందోబస్తు, ప్రోటోకాల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశాల్లో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, ఏఎస్పీ సాయికిరణ్, అధికారులు పాల్గొన్నారు.



## ఆలయ షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు

**నిర్మల్--భైంసా, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భైంసా పట్టణంలోని పద్మావతి కాలనీలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వద్ద షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంజూరు పత్రాన్ని ఆలయ ప్రతినిధులకు అందజేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు వెండి, బంగారు వర్తక సంఘం అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి కోర్వ శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## చేతిలో చిన్న కార్డు.. కుటుంబానికి పెద్ద భరోసా



**హుజూర్‌నగర్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి)**
: ఆహార భద్రతా కార్డులు పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తాయని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు అన్నారు. గోవిందపురంలోని 8, 9వ వార్డుల్లో సుమారు 650 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్నబియ్యం అందిస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోల ఉదయభాను ఉపేందర్, ధనమ్మ, సంపత్‌రెడ్డి, డీలర్ ధనమూర్తి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదానం మహా పుణ్యం

### పడకరాయిగుట్టలో మహా అన్నదానం



**హుజూర్‌నగర్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
పడకరాయిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో ప్రతి శుక్రవారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోదాడకు చెందిన చెన్నమల్లు నరసింహచారి--సుజాత దంపతులు, మేళ్లచెరువుకు చెందిన బండి రవీందర్‌రెడ్డి--శ్రావణి దంపతుల సహకారంతో మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామివారి సన్నిధిలో అన్నదానం చేయడం తమకు గొప్ప భాగ్యంగా భావిస్తున్నామని తెలిపారు. ఆలయ అధ్యక్షుడు శాగం రెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు, కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య, వీరవల్లి గురునాథం, శంకరమ్మ, కోటేశ్వరరావు, అమరోజ్ నాగరాజ్, పాల్గొన్నారు.



## వర్షాలు సమృద్ధిగా కురవాలని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

**చౌటుప్పల్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ చౌటుప్పల్ పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని, రైతులకు అనుకూల పరిస్థితులు ఏర్పడి పంటలు సమృద్ధిగా పండాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు, చిన్నారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్

**హనుమకొండ, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
కాకతీయ విశ్వవిద్యాలయం సైన్స్ ఫ్యాకల్టీలో 2026--27 జూలై సెషన్‌కు పీహెచ్‌డీ ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీన్ ప్రొ. బి. వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. బోటనీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మైక్రోబయాలజీ, మ్యాథమెటిక్స్, జియాలజీ, ఫిజిక్స్, జువాలజీ విభాగాల్లో మొత్తం 64 సీట్లు అందుబాటులో ఉన్నాయి. యూజీసీ--నెట్, సీఎస్ఐఆర్--నెట్, గేట్ తదితర జాతీయ స్థాయి అర్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత విద్యార్హతల్లో కనీసం 55 శాతం మార్కులు అవసరం కాగా, రిజర్వేషన్ వర్గాలకు 5 శాతం సడలింపు ఉంటుంది. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలు, పరిశోధన ప్రతిపాదన, ఫీజు రసీదుతో అక్టోబర్ 24లోగా సైన్స్ ఫ్యాకల్టీ డీన్ కార్యాలయంలో సమర్పించాలి. ఓసీ, బీసీలకు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజుగా నిర్ణయించారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మించాలి

### కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే చొరవ తీసుకోవాలి



**జయశంకర్ భూపాలపల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా 15వ వార్డు కాకతీయ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నెరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. కేంద్రంలో సరైన గదులు, తాగునీరు, మరుగుదొడ్డి, స్టోర్‌రూమ్ వంటి సౌకర్యాలు లేవని తెలిపారు. ప్రస్తుతం చిన్నారులు చదువుకునే గదిలోనే ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని నిల్వ చేయాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. విధులు నిర్వహించాల్సిన ఉపాధ్యాయురాలు సుమారు ఏడాదిగా సెలవులో ఉన్నట్లు తెలిపారు. చిన్నారుల విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే స్పందించి నూతన భవనం, అవసరమైన సిబ్బంది, మౌలిక వసతులు కల్పించాలని జోసెఫ్ కోరారు.

## ఎంపీపీఎస్, ప్రీ-ప్రైమరీ పాఠశాలలో కలెక్టర్, ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గుడిహత్నూర్ మండలం వైజాపూర్ గ్రామంలోని ఎంపీపీఎస్, ప్రీ-ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాబోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించి వారి విద్యా నైపుణ్యాలను తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, డీఎంహెచ్ఓ. డా.సాధన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, స్థానిక సర్పంచ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా సోమారపు సామెల్

**మందమర్రి, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**



మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శిగా సోమారపు సామెల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, మందమర్రి టౌన్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అణగారిన వర్గాలకు హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం, సంక్షేమం అందేలా కృషి చేస్తానన్నారు.

## పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం



ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలిచి, వారికి భరోసా కల్పించడమే 'మీకోసం మేమున్నాం' సంస్థ లక్ష్యమని చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ అన్నారు. విజయకాలనీకి చెందిన 62 ఏళ్ల వికలాంగురాలు కొంగూరు సత్యవతి అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సాయం కోరగా, సంస్థ ఆధ్వర్యంలో దాతల నుంచి నిధులు సేకరించారు. సత్యవతికి గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించి శస్త్రచికిత్స అవసరమని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె సంస్థను ఆశ్రయించగా, దాతల నుంచి సేకరించిన రూ.8 వేల నగదును కార్యవర్గ సభ్యుడు గొట్టిపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి



తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నీలి ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీవీ ప్రతాప్, కవ్వాల రాము, దొడ్డి సూరిబాబు, సింగ సంతోష్, అక్కినేని నెహ్రూ, గుద్దేటి బాలు, దొడ్డి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## కోయ భాషకు ఎనిమిదో షెడ్యూల్‌లో స్థానం కల్పించాలి

**భద్రాచలం, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
కోయ భాషకు భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో స్థానం కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. భద్రాచలం గిరిజన భవన్‌లో విశ్వ గోండు సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న గోండు--కోయ భాషా ప్రామాణీకరణ సదస్సులో ఆయన మాట్లాడారు. గోండు, కోయ భాషా నిపుణులతో నిర్వహిస్తున్న సదస్సుల్లో ప్రాచీన పదాలను సేకరించి నిఘంటువు రూపొందిస్తున్నట్లు తెలిపారు. భాషతో పాటు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, మాండలికాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గోండు--కోయ భాషకు రాజ్యాంగబద్ధ గుర్తింపు కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

## వృత్తిపరంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

### రిటైర్డ్ ఎంఈఓ బెక్కంటి శ్రీనివాసరావు

**భద్రాచలం, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**



విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే క్రమంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రిటైర్డ్ ఎంఈఓ బెక్కంటి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకునే స్థాయికి ఎదగడంలో సహచర ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. గత 40 ఏళ్లుగా వృత్తిపరంగా, ప్రవృత్తిపరంగా తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను చేపట్టిన కార్యక్రమాలకు స్వచ్ఛందంగా, నిస్వార్థంగా సహకరించిన వారి సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## దివ్యాంగులు, వయోవృద్ధులు, ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



**భద్రాచలం, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
, వయోవృద్ధులు, ఆటో డ్రైవర్ల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల శ్రేష్ఠ తెలిపారు. శనివారం తన కార్యాలయం వద్ద ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఐఐటీ-జేఈఈ, నీట్, సీయూఈటీ వంటి పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. కంప్యూటర్ నైపుణ్యాలు, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం బ్రిడ్జ్ పాయింట్ ఆటో స్టాండ్‌ను సందర్శించి డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దసరా అడ్వాన్స్ పెంచేలా చూడాలి

### ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్‌కు కార్మికుల వినతి



**కొత్తగూడెం, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చే దసరా పండుగ అడ్వాన్స్‌ను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్‌కు శనివారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా రూ.25 వేల పండుగ అడ్వాన్స్ మాత్రమే ఇస్తున్నారని, పెరిగిన నిత్యావసర వస్తువులు, దుస్తుల ధరల నేపథ్యంలో ఈ మొత్తం సరిపోవడం లేదని తెలిపారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దసరా అడ్వాన్స్‌ను పెంచాలని కోరారు. దీనిపై ఎండీ రజాక్ సానుకూలంగా స్పందించారు. జీఎం, సింగరేణి డైరెక్టర్లు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలి

- గాంధీజీ విగ్రహానికి తల్లాడ జర్నలిస్టుల వినతి
- ఘనంగా ఏనుగు వెంకటేశ్వరరావు, అఫ్జల్ పఠాన్ జన్మదిన వేడుకలు





**తల్లాడ, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తల్లాడ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, పరిమితులు లేని హెల్త్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలని కోరారు. ఐజేయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా తల్లాడలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎండీ బహదూర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరంతరం విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పాత్రికేయులకు సమగ్ర రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### ఘనంగా జన్మదిన వేడుకలు

అనంతరం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, తెలంగాణ వాణి నెట్వర్క్ఇంచార్జి అఫ్జల్ పఠాన్ జన్మదిన వేడుకలను తల్లాడ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎండీ బహదూర్ కేక్ కట్ చేసి సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఏనుగు వెంకటేశ్వరరావు, అఫ్జల్ పఠాన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, గొడ్ల బాబురావు, దేవళ్ల ఉపేంద్ర, ఇసనపల్లి శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, నారపోగు ప్రసాద్, గొడ్ల నరసింహారావు, గొల్లమందల ప్రేమ్‌కుమార్, కాంపాటి రవి, కొత్తపల్లి విజయ్, రేగళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం అభినందనీయం

### గిరిజన, గ్రామీణ పేదలకు ఎంతో మేలు: మంత్రి పొంగులేటి



**సత్తుపల్లి, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
సత్తుపల్లి మండలం నారాయణపురంలో షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.200 కోట్లకు పైగా అంచనా వ్యయంతో నిర్మించనున్న క్యాన్సర్ ఆసుపత్రి, వ్యాక్సినేషన్, ఉచిత వైద్య సహాయక కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు, హెచ్‌పీవీ టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే నివారించే అవకాశం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడం, వైద్య ఖర్చుల భయంతో చాలామంది ఆలస్యంగా చికిత్స పొందుతున్నారని మంత్రి పేర్కొన్నారు. పేదలకు ఉచిత వైద్యం, టీకాలు అందించేందుకు ట్రస్ట్ ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలపై ట్రస్ట్ దృష్టి సారించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి అశ్వారావుపేట, ములకలపల్లి, ఏపీ సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ట్రస్ట్ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మహానంది జాతీయ పురస్కారం అందుకున్న ఊకంటి మహేందర్‌కు ఘన సన్మానం

**జమ్మికుంట, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
జమ్మికుంట పోస్ట్‌మాస్టర్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్‌కు మహానంది జాతీయ పురస్కారం లభించింది. ఉద్యోగ సేవా రంగంలో అంకితభావంతో పనిచేస్తూ సహచర ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలిచినందుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుడు మంద జగన్ ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీసులో మహేందర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. జాతీయ పురస్కారం అందుకోవడం జమ్మికుంటకు గర్వకారణమని జగన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంబాల రాజు, మరముల్ల ప్రభు, మహమ్మద్ సందానితో పాటు పలువురు పాల్గొన్నారు

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి




**జమ్మికుంట, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ అన్నారు. జమ్మికుంట వోకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన హాజరై నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కళాశాల ప్రిన్సిపాల్లు కుమార్, అబ్దుల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## రామస్వామి గుట్ట వద్ద శ్రీ రామలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ



**రాజాపేట, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం రఘునాథపురంలోని రామస్వామి గుట్ట వద్ద శనివారం శ్రీ రామలింగేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సప్తమి, ఆరుద్ర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు శివనామ, రామనామ స్మరణతో గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులు శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన




**రాజాపేట అక్టోబర్: 03(తెలంగాణ వాణి విలేకరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో భూదాన్ పోచంపల్లి లో జరిగిన విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్వేత పైన జరిగిన దాడికి నిరసనగా ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజాపేట వైద్యాధికారి మోసెస్ రాజ్ ఆధ్యర్యంలో వైద్య ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సి హెచ్ విజయ రాణి హెచ్ ఈ ఓ భీకు నాయక్ స్టాఫ్ నర్స్ సరిత హెచ్ వి విజయలక్ష్మి జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్ అలేఖ్యలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**దేవరకొండ, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**
దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన నూనె వెంకటమ్మ కుటుంబానికి గ్రామ శాఖ సెక్రటరీ పల్లా రంగారెడ్డి ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో శాఖ సభ్యులు కిన్నెర యాదయ్య, కాటం గోవర్ధన్, కిన్నెర భారిములు, పల్లె కృష్ణయ్య, ముడి రాజు, బచ్చుగాళ్ల కృష్ణయ్య, కిన్నెర సంజీవ, బొడ్డుపల్లి వెంకటయ్య, నూనె రమేష్, కాటం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## హరిణి మృతికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠిన శిక్ష విధించాలి
- హరిణి కుటుంబాన్ని పరామర్శించిన ఏఎండీఆర్ ఫౌండేషన్ ఆదిల్

**కొత్తగూడెం, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి)**



హరిణి మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యుడిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఏఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి ఎండి ఆదిల్ డిమాండ్ చేశారు. హరిణి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిల్ మాట్లాడుతూ.. హరిణి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ వంతు అండగా ఉంటామని తెలిపారు. కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడిపై పటిష్టమైన ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేయాలని కోరారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఏఎండీఆర్ ఫౌండేషన్ ముందుంటుందని ఆదిల్ స్పష్టం చేశారు. ఘటనపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యల ద్వారా భరోసా కల్పించాలని కోరారు. హరిణి సోదరి ఉన్నత చదువులకు తమ ఫౌండేషన్ అండగ ఉంటుందని, భవిష్యత్ లో వాళ్ళ కుటుంబానికి ఎటువంటి ఆర్థిక భరోసా కావాలన్న తాము అండగ ఉంటామన్న ఆయన హరిణి ఘటనలో ఎటువంటి న్యాయ పరమైన సహకారం చేసేందుకు తమ బృందం సిద్ధంగా ఉందన్నారు.

## పాల్వంచలో నకిలీ పెన్షన్లపై విచారణకు డిమాండ్



**పాల్వంచ, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**

పట్టణంలోని 27 డివిజన్లలో అర్హత లేని వ్యక్తులు దివ్యాంగ, వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. తప్పుడు ధ్రువపత్రాలతో దివ్యాంగ పెన్షన్లు పొందుతున్నారని, సదరం సర్టిఫికెట్ల జారీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వ సంస్థల్లో రిటైర్ అయి అధిక పెన్షన్ పొందుతున్న కొందరు వృద్ధాప్య పెన్షన్లు కూడా తీసుకుంటున్నారని, అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద ధ్రువపత్రాలను ప్రత్యేక వైద్య బృందంతో పునఃపరిశీలించి, అనర్హులను గుర్తించి నిధులు రికవరీ చేయడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాలోత్ ప్రశాంత్ నాయక్, కొత్తపల్లి విజయ, శాంపురి నాగేంద్రబాబు, వాంకుడోత్ హాథిరాం తదితరులు పాల్గొన్నారు.

## గుంటక నరసయ్య పంతులు సేవలు చిరస్మరణీయం



**కరీంనగర్, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**

పద్మశాలి సమాజ అభివృద్ధి, విద్యా వికాసం, చేనేత కార్మికుల సంక్షేమం, సామాజిక సంస్కరణల కోసం గుంటక నరసయ్య పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. చేనేతోద్యమ పితామహుడు గుంటక నరసయ్య పంతులు 124వ జయంతి వేడుకలను శనివారం కరీంనగర్ పద్మశాలి హాస్టల్‌లో జిల్లా పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రస్ట్ కార్యదర్శి అల్ల భద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి సబ్బని లక్ష్మీనారాయణ ముఖ్యవక్తగా హాజరై నరసయ్య పంతులు సేవలను స్మరించుకున్నారు. పద్యకవి బొద్దుల లక్ష్మయ్య నరసయ్య పంతుల కృషిని పద్యాల రూపంలో వివరించారు. సాధారణ చేనేత కుటుంబంలో జన్మించిన నరసయ్య పంతులు విద్య, పుస్తక పఠనంపై ఆసక్తితో పాటు పిల్లలకు బోధిస్తూ 'పంతులు'గా గుర్తింపు పొందారని వక్తలు తెలిపారు. రాత్రి పాఠశాలలు, సామాజిక కార్యక్రమాల ద్వారా విద్య, చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించారని పేర్కొన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహానికి అనుకూలంగా ప్రచారం నిర్వహించడంతో పాటు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. మగ్గం పన్ను, వెట్టి చాకిరి, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా చేనేత కార్మికులను సంఘటితం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. విద్యార్థుల కోసం వసతి గృహాలు, సామాజిక సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్లు పచ్చునూరి నర్సయ్య, కట్ల ఆనందం, వాసం శివనారాయణ, మెతుకు గోపి, చిలుక నర్సప్ప, వేముల రమణయ్య, పాము రాజేశం, దేవత వెంకటరాజం తదితరులతో పాటు పద్మశాలి హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## టీపీసీసీ చీఫ్‌కి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆశావాహుల విజ్ఞప్తి



గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు, ప్రభుత్వ, పార్టీ పదవుల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆశావాహులు టీపీసీసీ చీఫ్ కి విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్నామని, తమకు అవకాశాల ఇవ్వాలని వారు మహేష్ కుమార్ గౌడ్ ని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందు ఆసక్తి చూపిన అభ్యర్థులతో శనివారం గాంధీభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలను, సూచనలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ అభ్యర్థుల ఎంపిక పార్టీ కోణంలో జరిగిందని, రాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల్లో రెండు సీట్లు బీసీలకు ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నామని చెప్పినట్లుగా తెలిసింది.దసరా నాటికి 60 కార్పోరేషన్ చైర్మన్ల పదవులను భర్తీ చేస్తామని, బీసీలకు మంత్రి పదవులు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని టీపీసీసీ చీఫ్ వెల్లడించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారిని కాపాడుకుంటామని, ఆశావహులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని, యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపినట్లుగా తెలిసింది. బీసీలకు పార్టీ, నామినేటెడ్ పోస్టులలో 42 శాతం కేటాయించాలని, రానున్న మూడు గవర్నర్ కోట ఎమ్మెల్సీలను బీసీలకు ఇవ్వాలని అవకాశం ఇవ్వాలని ఓ ఆశావాహ అభ్యర్థి కోరినట్లుగా తెలిసింది. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆశావాహులు గౌరీ సతీష్, లోకేష్ యాదవ్, చనగాని దయాకర్, బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి, చరణ్ కౌశిక్ లు పాల్గొన్నారు.

# పీఎల్ఆర్ బోనస్‌పై రూ.1,10,250కు ఒప్పందం

- సింగరేణి కార్మికులకు వెంటనే లాభాల వాటా బోనస్ ప్రకటించాలి
- బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం డిమాండ్

**కొత్తగూడెం, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**





దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు 2026 సంవత్సరానికి సంబంధించిన పీఎల్ఆర్ బోనస్‌పై సుదీర్ఘ చర్చలకు తెరపడింది. శనివారం కోల్‌కతాలో జరిగిన కోల్ ఇండియా అపెక్స్ జేసీసీ సమావేశంలో కోల్ ఇండియా యాజమాన్యం, సింగరేణి యాజమాన్య ప్రతినిధులు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు బోనస్‌పై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కార్మికుల తరఫున చర్చల్లో పాల్గొని న్యాయమైన బోనస్ అందించాలని కోరారు. చర్చల అనంతరం 2026 సంవత్సరానికి కోల్ ఇండియా, సింగరేణి కార్మికులకు రూ.1,10,250 పీఎల్ఆర్ బోనస్ చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. దసరా పండుగ సందర్భంగా కోల్ ఇండియా కార్మికులకు ఈ బోనస్ చెల్లించాలని నిర్ణయించారు. అయితే సింగరేణిలో కార్మికులకు లాభాల వాటా బోనస్ చెల్లించే సంప్రదాయం రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతోందని బీఎంఎస్ పేర్కొంది. సాధారణంగా దసరా సందర్భంగా లాభాల వాటా బోనస్ చెల్లించే ఆనవాయితీ ఉందని తెలిపింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి సంస్థ వాస్తవ లాభాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడం, కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటా బోనస్‌పై స్పష్టత లేకపోవడం పట్ల కార్మికుల్లో ఆందోళన నెలకొంది. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపులో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నందున, సంస్థకు వచ్చిన లాభాల్లో వారికి న్యాయమైన వాటా అందించాలని బీఎంఎస్ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, ఆ లాభాల ఆధారంగా కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటా బోనస్‌ను నిర్ణయించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ్ నాయక్ కోరారు. దసరా పండుగకు ముందే బోనస్ చెల్లించి కార్మిక కుటుంబాల్లో పండుగ ఆనందాన్ని నింపాలని ఆయన డిమాండ్ చేశారు. కోల్ ఇండియా కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ విషయంలో తీసుకున్న నిర్ణయం మాదిరిగానే సింగరేణి కార్మికుల పట్ల కూడా యాజమాన్యం సానుకూలంగా స్పందించి తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అపెక్స్ జేసీసీ సమావేశంలో బీఎంఎస్ తరఫున కొత్తకాపు లక్ష్మారెడ్డి, హెచ్ఎంఎస్ తరఫున హర్భజన్ సింగ్ సిద్ధు, ఏఐటీయూసీ తరఫున లఖన్‌లాల్ మెహతో, సీఐటీయూ తరఫున రామానందన్ తదితర ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. సింగరేణి తరఫున డైరెక్టర్ గౌతమ్ పోట్రూ, జి.వి. కిరణ్ కుమార్ సమావేశానికి హాజరయ్యారు.

# జర్నలిస్టుపై హత్యాయత్నం కేసులో సుపారీ కోణం

**రూ.5 లక్షలకు ఒప్పందం..**

**రూ.2 లక్షలు అడ్వాన్స్ ఇచ్చినట్లు పోలీసుల వెల్లడి**

**పాల్వంచ, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):**




పాల్వంచ పట్టణంలోని కనకదుర్గ బార్ వద్ద జర్నలిస్టు మనుపూరి ప్రభాకర్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో సుపారీ కుట్ర కోణాన్ని పోలీసులు ఛేదించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసులు కేసు వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 7న రాత్రి 8.30 గంటల సమయంలో కనకదుర్గ బార్ నుంచి బయటకు వస్తున్న ఎన్‌హెచ్-9 ఎలక్ట్రానిక్ మీడియా ఛైర్మన్, జర్నలిస్టు మనుపూరి ప్రభాకర్‌పై ముగ్గురు వ్యక్తులు సోడా బాటిళ్లతో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 345/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీడీఆర్, సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను పరిశీలించగా కుట్ర వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ప్రభాకర్ వద్ద పాల నాగేశ్వరరావు రూ.40 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, తిరిగి చెల్లించాలని ఒత్తిడి రావడంతో ఆయనను హతమార్చేందుకు పథకం వేసినట్లు పోలీసులు వెల్లడించారు.కొత్తగూడెం పెట్రోల్ బంక్ ఆపరేటర్ దాసరి రాజు ద్వారా వన్‌టౌన్ రౌడీషీటర్ అరవ వినయ్‌కుమార్‌ను సంప్రదించి రూ.5 లక్షలకు సుపారీ కుదుర్చుకున్నారని, అందులో రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చినట్లు తెలిపారు. ఘటన రోజున నాగేశ్వరరావు, ప్రభాకర్ కలిసి బార్‌లో మద్యం సేవించగా, అనంతరం ప్రభాకర్ కదలికలను రాజు ద్వారా వినయ్‌కుమార్‌కు చేరవేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో బార్ వద్ద కాపుకాసి దాడి చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఏ-1 అరవ వినయ్‌కుమార్, ఎలగడ శివకృష్ణ, దాకూరి గణేష్ అలియాస్ ఘని, దాసరి రాజు, పాల నాగేశ్వరరావులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందులో అరవ వినయ్‌కుమార్‌ను సెప్టెంబర్ 10న రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

# గాంధీ జయంతి రోజున ఎల్లారెడ్డిలో మద్యం అమ్మకాల జోరు!

**బెల్ట్ షాపుల్లో విక్రయాలపై ఆరోపణలు.. అధికారుల తీరుపై విమర్శలు**

**,తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్. రమేష్, అక్టోబర్ 3 :**






గాంధీ జయంతి సందర్భంగా మద్యం విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ ఎల్లారెడ్డి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పండుగ రోజు కూడా యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి పట్టణంతో పాటు మండలం లోని కొన్ని ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారు నిబంధనలను పట్టించుకోవడం లేదని, సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గాంధీ జయంతి రోజున మద్యం విక్రయాలపై అధికారులు తనిఖీలు నిర్వహించారా? ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంతమేర మద్యం స్వాధీనం చేసుకున్నారు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారుల వ్యవహారశైలిపై కూడా మండల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.అదేవిధంగా మండల స్థాయి కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం, అధికారులపై వస్తున్న ఇతర ఆరోపణలపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. గాంధీ జయంతి రోజున మద్యం విక్రయాలపై వచ్చిన ఆరోపణలపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# జ్ఞానేష్ కుమార్‌ను తొలగించడమే కాదు.. అరెస్ట్ చేయాలి : టీపీసీసీ చీఫ్



ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారాన్ని ఇండియా కూటమి తీవ్రంగా ఖండిస్తుందని, అర్హత కలిగిన లక్షల మంది పౌరుల ఓట్లు తొలగిస్తున్నారు..కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఇండియా కూటమి పార్టీలు సీపీఐ, సీపీఎం, టీజేఎస్, ఎస్పీ, ఆర్జేడీ, బీసీ జన సమితి నాయకులతో గాంధీభవన్ లో శనివారం మహేష్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. ఈసీ పక్షపాత వైఖరి అవలంభిస్తోందని ఆరోపిస్తూ.. ఈ అంశంపైన ఉమ్మడి పోరాట కార్యాచరణను రూపొందించడానికి ఈ సమావేశంలో నేతలు చర్చించారు.

ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ కూటమి పార్టీలన్నీ కలిసి ఈనెల 6న జిల్లా హెడ్ క్వార్టర్ లో ర్యాలీ నిర్వహించి.. కలెక్టర్ల నిర్బంధం చేస్తామని, ఈనెల 8న కూటమి అన్ని పార్టీలు కలిసి లోక్ భవన్ ముట్టడిస్తామన్నారు. నవంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లుగా మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. బీజేపీ ఈడీని విచ్చల విడిగా వాడుతోందని, ఎన్నికల కమిషన్ ను లోబర్చుకొని చేయకూడని పనులన్నీ చేస్తుందని ఆయన మండిపడ్డారు. కేవలం సర్ వల్లే బెంగాల్ లో మమతా బెనర్జీ ఓడిపోయిందని ఆరోపించారు. ఈసీ సర్ పేరుతో నిజమైన ఓట్లను తొలగిస్తుందని, జ్ఞానేశ్ కుమార్ ను తొలగించడమే కాదు..అరెస్ట్ చేయాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

ఫారం 6లో నిబంధనలతో ఓట్లు చేర్చుకుండా చేస్తున్నారు : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, జాన్ వెస్లీ

సర్ పేరు తో 13 కోట్ల ఓట్లను తొలగించారని, ఫాం 6లో నిబంధనలతో ఓట్లు చేర్చుకుండా చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఎన్నికలు తమకు అనుకూలంగా మార్చుకునేలా బీజేపీ వ్యవహరిస్తుందని, తొలగించిన ఓట్లలో అర్హులైన వారిని తిరిగి చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

మోదీ ఏది చెబితే సీఈసీ అది చేస్తున్నారు : సీపీఐ సీనియర్ నేత, ఈటీ నర్సింహ

మోదీ ఏది చెబితే సీఈసీ అది చేస్తున్నారని, ఇది దేశ ప్రజాస్వామ్యంకు ముప్పుగా పరిణమించిందని సీపీఐ నేత ఈటీ నర్సింహా విమర్శించారు. మోదీకి వ్యతిరేకంగా పెడుతున్న కామెంట్స్ ను, ట్యాగ్ చేసి ఓటర్ లిస్టు నుంచి తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. మోదీ బీజేపీ విధానాలను అర్థం చేసుకోవాలని, తమ నిరసనలో సామాన్య ప్రజలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బాక్సాఫీస్ వద్ద దసరా పోరు..

## 'ది ప్యారడైజ్' బాటలో 'రణబాలి'!




సినిమా రంగంలో బాక్సాఫీస్ లెక్కలు ఎప్పుడూ మారుతాయన్న సంగతి తెలిసిందే. ఒక సినిమా సాధించిన విజయాలు లేదా రికార్డులు తదుపరి సినిమాలకు ఒక బెంచ్‌మార్క్‌గా మారుతుంటాయి. తాజాగా నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన 'ది ప్యారడైజ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌లను నమోదు చేసి సంచలనం సృష్టించింది. ఈ సినిమాకు ఒక వైపు నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, కేవలం నాలుగు రోజుల్లోనే ఈ సినిమా రూ. 155 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు యూనిట్ వర్గాలు వెల్లడించాయి. ఇక నాని కెరీర్‌లో ఇటువంటి భారీ వసూళ్లు సాధించడం ఆయన స్టార్‌డమ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లినట్లు ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు.

ఈ నేపథ్యంలో అదే బాక్సాఫీస్ సెంటిమెంట్‌ను రిపీట్ చేయడానికి టాలీవుడ్ మరో భారీ చిత్రంతో సిద్ధమవుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రణబాలి'. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో, ఆ కాలంలోని కరువు పరిస్థితుల సృష్టితో పాటు ఒక సరికొత్త ఆత్మకథాత్మక లేదా మిస్టరీ అంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం అత్యంత భారీ ఎత్తున విడుదలకు ముస్తాబవుతోంది.

ఇప్పటికే విడుదలైన టీజర్లు, డాక్యుమెంటరీ సిరీస్ వీడియోలు మరియు పోస్టర్లు ఈ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. 'ది ప్యారడైజ్' సినిమాకు ఏ విధంగానైతే బలమైన పాజిటివ్ బజ్ క్రియేట్ అయిందో, 'రణబాలి' విషయంలోనూ మేకర్స్ అదే వ్యూహంతో విజయవంతమయ్యారు. ఈ చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ గత చిత్రాలైన 'టాక్సీవాలా', 'శ్యామ్ సింగరాయ్' విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించాయి. ఆయన నుంచి వస్తున్న మరో పీరియాడికల్ డ్రామాపై భారీ అంచనాలు ఉండటంలో ఆశ్చర్యం లేదు. మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట తెరపై కనిపించనుండటం, ముఖ్యంగా వీరిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి 'యూ/ఏ' సర్టిఫికెట్ లభిస్తే, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా పెద్ద ఎత్తున థియేటర్లకు క్యూ కట్టే అవకాశం ఉంది. దసరా సెలవుల జోరుతో 'రణబాలి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి. ఇక త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌తో ప్రస్తుత హైప్ మరింత రెట్టింపు కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మోహన్‌లాల్‌తో నటించడం ఆశీర్వాదం..

## భాగ్యశ్రీ బోర్సే ఎమోషనల్ పోస్ట్ వైరల్



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి భాగ్యశ్రీ బోర్సే ఇప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. మలయాళ సూపర్‌స్టార్ మోహన్ లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఆపరేషన్ గంగా' సినిమాతో ఆమె మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. తాజాగా మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన భాగ్యశ్రీ.. ఆయనతో కలిసి పనిచేస్తున్న అనుభవాన్ని వివరిస్తూ రాసిన మాటలు ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మోహన్‌లాల్‌తో కలిసి నటించడం తనకు ఆశీర్వాదంగా భావిస్తున్నానని భాగ్యశ్రీ పేర్కొన్నారు. షూటింగ్‌లో ప్రతి రోజూ ఆయన నుంచి ఎంతో నేర్చుకుంటున్నానని, ఆయన చూపు ద్వారా సినిమాను మరో కోణంలో చూడగలుగుతున్నానని తెలిపారు.

మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఫొటోను పంచుకున్న భాగ్యశ్రీ.. ఆయనపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. మోహన్‌లాల్‌కు సహనటిగా ఉండటం తనకు ఒక ఆశీర్వాదంలా అనిపిస్తోందని తెలిపారు.ప్రతి రోజు షూటింగ్‌లో ఆయనను చూస్తూ సినిమాను ఎలా చూడాలో నేర్చుకుంటున్నానని, ఆయనలో ఉన్న ప్రతిభ నిజంగా అద్భుతమని ప్రశంసించారు. ఒక సీనియర్ నటుడితో కలిసి పనిచేసే అవకాశం రావడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని ఆమె పేర్కొన్నారు. భాగ్యశ్రీ చేసిన ఈ పోస్టు మోహన్‌లాల్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. కొత్త నటి తన సహనటుడైన మోహన్‌లాల్ గురించి ఇంత ఆప్యాయంగా, గౌరవంగా మాట్లాడటంపై అభిమానులు స్పందిస్తున్నారు.

భాగ్యశ్రీ బోర్సే 'ఆపరేషన్ గంగా' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంలో ఆమె మోహన్‌లాల్‌తో కలిసి నటిస్తున్నారు. తెలుగులో ఇప్పటికే సినిమాలు చేసిన భాగ్యశ్రీకి ఈ చిత్రం మరో ముఖ్యమైన అవకాశం అని చెప్పొచ్చు. విష్ణు మోహన్ దర్శకత్వం వహిస్తున్న 'ఆపరేషన్ గంగా' సినిమాకు సంబంధించిన జార్జియా షెడ్యూల్ తాజాగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో మోహన్‌లాల్, భాగ్యశ్రీ బోర్సేతో పాటు బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కూడా షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. ఈ సినిమా 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేపట్టిన తరలింపు కార్యక్రమం నేపథ్యంలో తెరకెక్కుతోంది.ఆ సమయంలో వేలాది మంది భారతీయులు ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయారు. వారిని సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి చేపట్టిన భారీ తరలింపు చర్యలే ఈ సినిమాకు ప్రధాన నేపథ్యంగా నిలవనున్నాయి.



# హాలీవుడ్ రేంజ్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'..

## గూస్‌బంప్స్ తెప్పించే మూడు యాక్షన్ బ్లాక్స్!




టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'డ్రాగన్'. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ప్రశాంత్ నీల్ సినిమాలంటేనే విజువల్ వండర్స్, ఎమోషనల్ డెప్త్ మరియు గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ ఎపిసోడ్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. అయితే ఈసారి 'డ్రాగన్' కోసం నీల్ ఆ అంచనాలకు మించి రెట్టింపు స్థాయిలో యాక్షన్ ప్లాన్ చేసినట్లు సమాచారం. కేవలం సాధారణ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లా కాకుండా, హాలీవుడ్ స్థాయి సాంకేతిక విలువలతో విజువల్ విందుగా ఈ చిత్రాన్ని మలచడానికి చిత్ర యూనిట్ చాలా శ్రమిస్తోంది. ముఖ్యంగా సినిమాలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ ఈ చిత్రానికి ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. ప్రతి ఫైట్ సీక్వెన్స్‌కు బలమైన భావోద్వేగ నేపథ్యం ఉండేలా ప్రశాంత్ నీల్ ఈ సన్నివేశాలను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. సినిమా ప్రారంభంలో వచ్చే జైల్ ఫైట్ గురించి ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తోంది. అత్యంత క్లిష్టమైన సెట్టింగుల మధ్య, భారీ హంగులతో తెరకెక్కించిన ఈ సీక్వెన్స్ ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కట్టిపడేయడం ఖాయమని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.

ఇక చిత్రంలోనే అత్యంత శక్తివంతమైన ఎపిసోడ్‌గా కాళీమాత ప్రాంగణం ఫైట్ నిలవబోతోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ సృష్టించిన మ్యాజిక్ ఈ ఫైట్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లనున్నాయి. కాళీమాత ప్రాంగణం నేపథ్యంలో వచ్చే ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ మాస్ అండ్ రౌద్ర రూపం థియేటర్లలో ప్రేక్షకులకు పూనకాలు తెప్పించడం పక్కా. అలాగే ఈ మూడు యాక్షన్ బ్లాక్స్‌లో అత్యంత క్రూరమైన మరియు భావోద్వేగంతో కూడిన బ్లడ్ ఫైట్ ఎపిసోడ్ సినిమాకే అసలైన హైలైట్‌గా నిలవబోతున్నట్లు సమాచారం. ఇది సాధారణ పోరాటంలా కాకుండా ఒక సర్వైవల్ వార్ లా సాగుతుంది. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో రక్తపుటేరులు పారేలా, ప్రతి ఫ్రేమ్‌లోనూ ఇంటెన్సిటీ మిస్ కాకుండా దీన్ని రూపొందించారు. ఈ మూడు భారీ యాక్షన్ బ్లాక్‌లు సినిమా రన్‌టైమ్‌లో కీలక మలుపులుగా నిలుస్తూ, కథను పరుగులు పెట్టించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని సమాచారం. వెండితెరపై ఈ విజువల్ వండర్‌ను చూస్తున్నప్పుడు ప్రేక్షకులు మైమరచిపోవడం ఖాయమనే మాట బాక్సాఫీస్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది.

# రామాయణంతో అనిల్ రావిపూడి కొత్త ప్రయోగం..

## భారీ యానిమేటెడ్ మూవీపై ఇంట్రెస్టింగ్ టాక్



దర్శకుడు అనిల్ రావిపూడి ఇప్పటివరకు తెరకెక్కించిన సినిమాలకు పూర్తి భిన్నంగా ఓ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. రామాయణం నేపథ్యంలో ఆయన దర్శకత్వంలో ఓ భారీ యానిమేటెడ్ చిత్రం రూపొందనుందనే వార్తలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ-విజువలైజేషన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, కథకు అనుగుణంగా భారీ స్థాయిలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్‌ను రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. కామెడీ, భావోద్వేగాలు, కుటుంబ అంశాలతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్‌ను తనదైన శైలిలో తెరకెక్కించడం అనిల్ రావిపూడి ప్రత్యేకత. అలాంటి దర్శకుడు రామాయణం వంటి పౌరాణిక ఇతిహాసాన్ని యానిమేటెడ్ రూపంలో ఎలా ఆవిష్కరిస్తారన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ ప్రాజెక్ట్‌లో రామాయణంలోని కీలక ఘట్టాలను ఆధునిక యానిమేషన్ సాంకేతికతతో భారీ స్థాయిలో చూపించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అయోధ్య, లంక, వానరసేన, రామసేతు, యుద్ధ సన్నివేశాలు వంటి కీలక ఘట్టాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు టాక్ వినిపిస్తోంది. సాధారణ యానిమేటెడ్ చిత్రాలకు భిన్నంగా అంతర్జాతీయ ప్రమాణాలతో విజువల్స్‌ను రూపొందించే దిశగా ప్రీ-విజువలైజేషన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

# రజనీకాంత్ 'జైలర్ 2' ట్రైలర్‌కు ముహూర్తం ఖరారు..

## పండగకు ముందే రానున్న టైగర్!




సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు.

ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.

# 22 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలోకి.. 'ఆరుగురు పతివ్రతలు' రీ-రిలీజ్!



దివంగత దర్శకుడు ఈ.వి.వి. సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం "ఆరుగురు పతివ్రతలు". అప్పట్లో వివాహ వ్యవస్థ, దాంపత్య జీవితంలోని సంక్లిష్టతలు, ఈగోలు మరియు కుటుంబ బంధాల నేపథ్యంలో సాగిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఓ సరికొత్త సంచలనం సృష్టించింది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఆలోచింపజేసిన ఈ చిత్రం, ఇప్పుడు సరికొత్త హంగులతో మరోసారి థియేటర్లలో అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమాను అక్టోబర్ 29న అత్యంత వైభవంగా గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో పాత క్లాసిక్ సినిమాలను 4ఖ మరియు మెరుగైన సాంకేతిక హంగులతో రీ-రిలీజ్ చేసే ట్రెండ్ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వస్తున్న ఈ కల్ట్ ఫ్యామిలీ అండ్ బోల్డ్ ఎంటర్‌టైనర్ యూత్ ని, ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఒకేలా ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రం తొలిసారిగా 2004 ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సాధించింది. సరిగ్గా ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు సరికొత్త డిజిటల్ టెక్నాలజీతో నేటి తరానికి సరికొత్త వినోదాన్ని పంచేందుకు రీ-ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమా ప్రత్యేకత ఏమిటంటే, దర్శకుడు ఈవీవీ ఈ చిత్రం ద్వారా దాదాపు 42 మంది కొత్త నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేశారు. వారితో పాటు ప్రముఖ నటులు ఎల్.బి. శ్రీరామ్, చలపతిరావు తదితరులు కీలక పాత్రల్లో నటించి తమ నటనతో అలరించారు. మరి ఇన్నేళ్ల తర్వాత థియేటర్లలో రీ-ఎంట్రీ ఇస్తున్న ఈ కల్ట్ కామెడీ-డ్రామా మూవీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సందడి సృష్టిస్తుందో వేచి చూడాల్సిందే!

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com